క్లుప్తంగా

నేడు కొత్తూరులో వైద్య శిబిరం

విజయపురిసౌత్: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహణలో ఆదివారం మాచర్ల మండలం కొత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎల్‌వీ ప్రసాద్-సిద్ధార్థ మెడికల్ కాలేజ్, ఇతర వైద్యులు, టెక్నీషియన్లు వైద్య పరీక్షలు చేసి మందులు అందిచనున్నట్లు పేర్కొన్నారు.

మండాదిలో వాలీబాల్ పోటీలు



వెల్దుర్తి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల సందర్భంగా మండాదిలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలను గ్రామ సర్పంచి శీలం సైదారెడ్డి శనివారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.20వేలు, రూ. 15వేలు, రూ.10వేలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 4వ బహుమతి రూ. 7వేలతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆదివారం విద్యుత్ ప్రభలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నాం..

చైర్మన్ దేవానంద్



దాచేపల్లి: గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. దాచేపల్లి గ్రంథాలయంలో శనివారం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజ్ఞానాన్ని పెంపొందించేలా అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. గ్రంథాలయాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కందుల ఝాన్సీలక్ష్మి, గ్రంథాలయ అధికారి శివపార్వతి, దాతలు వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, ఆశోక్ కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

27మంది బైండోవర్

కారెంపూడి: భార్యభర్తల మధ్య గొడవ పెద్దదై ఇరువర్గాల ఘర్షణకు దారితీసిన ఘటన మండలంలోని చినగార్లపాడు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామాంజనేయులు ఇరు వర్గాలకు చెందిన 27 మందిని అదుపులోకి తీసుకుని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ జె.శ్రీనివాస్ ఎదుట హాజరుపరిచారు. వారిలో 20 మంది పురుషులు, ఏడుగురు మహిళలున్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఘనంగా జరుగుతోంది. శనివారం అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి నవ కలశ స్నపన, పంచామృత స్నపన, హనుమత్ వ్రతం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నరసరావుపేటకు చెందిన శ్రీవెంకటేశ్వర సేవా సమాజం విష్ణు సహస్ర నామ గానామృతం చేపట్టింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు.

నేడు యథావిధిగా విద్యుత్ బిల్లుల చెల్లింపు

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురాంనగర్ ఈఆర్వో కార్యాలయంలో ఆదివారం విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెదచెరువు ప్రాంతానికి చెందిన ఇరగదిండ్ల చిన్న సైదయ్య(50) తాపీపని చేస్తుంటాడు. ఉదయం తన తాపీపని మేస్త్రీ రహిమాన్‌తో కలిసి స్కూటీపై పనికి వెళ్తున్నాడు. ఏరియా వైద్యశాల వద్దకు వచ్చేసరికి వెనుకగా వచ్చిన మినీలారీ ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ సైదయ్య అక్కడికక్కడే మృతి చెందగా రహిమాన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు మృతుడి భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వీరేంద్ర బాబు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ప్రథమస్థానం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పిన్నెల్లి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిఆర్కే

మాచర్ల రూరల్: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రథమ స్థానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అమ్మాని జమ్మలమడక గ్రామ పరిధిలోని లింగాపురం గ్రామంలో 5వ రోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లింగాపురం గ్రామ ప్రజలు, యువకులు, నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీగా పిన్నెల్లికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. వారికి నవరత్నాల బుక్‌లెట్ అందజేసి, లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని కానీ, పేదలు పేదలుగానే ఉండాలని ఎల్లో మీడియా, ప్రతిపక్ష పార్టీలు అప్పుల భారమంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత పాలనలో చంద్రబాబు నాయుడు రూ.లక్షల కోట్లు అప్పులు చేసి మలేషియా, సింగపూర్ దేశాలకు తరలించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రూపాయి పేదల ఖాతాల్లోనే జమ చేస్తోందని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జడ్పీటీసీ పెదమల్లు స్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, సర్పంచ్ ముక్కా చౌడయ్య, వడితె అంజమ్మ, సొసైటీ చైర్మన్ గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ పరిమళ ఏసోబు, సర్పంచి తరిపి శ్రీనివాసరావు ముదిరాజ్, యార్డు డైరెక్టర్ పరిమళ్ల లక్ష్మయ్య, నాయకులు తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, గొబ్బూరి ఆదెయ్య, ముక్కా గురవయ్య, మాజీ ఎంపీపీ పేర్ల మల్లయ్య, కూరబోయిన పెద అప్పయ్య, పచ్చిపాల కొండ, కె.బసవ నాగేశ్వరరావు, జల్లెల కోటేశ్వరరావు, వడితె బాబునాయక్, మున్నా రామకృష్ణ, దుర్గెంపూడి సీతారామిరెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, రామిశెట్టి ప్రసన్నాంజనేయులు, ఈడెబోయిన గురవయ్య, పరిమళ మల్లయ్య, లక్ష్మయ్య, జి వెంకట్రామయ్య, తిప్పారెడ్డి పోలిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, జూకూరి వెంకట్రామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీసీ స్కూల్ వార్షికోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌పీ శైలజ, చంద్రబోసు, స్వప్న, అయ్యంగార్



అలరించిన విద్యార్థిని నృత్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఏబీసీ స్కూల్ 40వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, సినీ గేయ రచయత చంద్రబోసు, యాంకర్ స్వప్నతోపాటు కొప్పరపు కవుల కలాపీఠం ఫౌండర్ మాశర్మ, పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్‌పీబీ(ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మ్యూజిక్) అకాడమీ 12వ స్మారక పురస్కార ప్రధానోత్సవం కూడా నిర్వహించారు. విద్యార్థుల సినీ గీతాలపనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. గాయని ఎస్పీ శైలజకు ఎస్పీబీ స్మారక పురస్కారాన్ని ఏసీబీ స్కూల్ చైర్మన్ అనంత కృష్ణ అయ్యంగార్ ప్రదానం చేశారు. ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజ, చంద్రబోసు మాట్లాడుతూ పిడుగురాళ్లల్లో విద్యా సంస్థను సరస్వతీ నిలయంగా తీర్చిదిద్ది, విద్యార్థులను ఉన్నత స్థితిలో నిలుపుతున్న యాజమాన్యాన్ని అభినందించారు. సంగీత విభావరి నిర్వహించటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమానికి మాశర్మ అధ్యక్షత వహించారు. అలాగే వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హాస్య నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు విద్యా సంస్థల చైర్మన్ అయ్యంగార్ తెలిపారు. ఆయనతోపాటు నర్సరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

తొలిధాన్యం.. అమ్మకు పొంగళ్ల నైవేద్యం

నేడు అంకమ్మతల్లి తిరుణాళ్ల



మూల విరాట్ అంకమ్మతల్లి

రాజుపాలెం: రాజుపాలెం అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిట కొంగుబంగారం ఆదిపరాశక్తికి ఏటా ఫిబ్రవరి ఆఖరి ఆదివారం తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పాడిపంటలు, భోగ భాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకతీతంగా తొలి ధాన్యపు కంకుల పొంగళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. చీర, సారెలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోణాలు సమర్పిస్తారు. గ్రామాలలో ఏకార్యక్రమం చేయాలన్నా ముందుగా అమ్మవారికి మొక్కులు తీర్చడం ఆనవాయితీ. సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ ప్రభలు, కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలతో రాత్రంతా జాగారం చేస్తారు. ఈ ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేవాలయాన్ని వివిధ రంగులతో ముస్తాబు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అర్చకులు అర్వపల్లి కోటినారాయణమూర్తి తెలిపారు. తిరుణాళ్లలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఎస్కే షఫీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, సినీ హీరోల చిత్రాలు, ఫ్లెక్సీలు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మొక్కల సంరక్షణ.. సిబ్బంది బాధ్యత

పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

బెల్లంకొండ: గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ఉపాధి హామీ సిబ్బంది తీసుకోవాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. 2021-2022 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలు అధిక శాతం చనిపోవడంతో సిబ్బందిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా ఒక్కో సిబ్బంది వంద మొక్కలు బ్రతికించే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. పనులకు రికార్డులు చూపించని వారికి, పండ్ల తోటల పెంపకంలో భాగంగా మొక్కలు తక్కువగా ఉన్న సిబ్బందికి మొత్తం రూ.12 వేలను రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ కోటమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్ నగర్ వాసులకు అండగా ఉంటాం

ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు, కలెక్టర్ శివశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, పక్కన ఎంపీ లావు

రాజుపాలెం: టీఎన్ నగర్‌లో జీవనోపాధి పొందుతూ నివాసముంటున్న 300 గృహాలకు ప్రభుత్వం ద్వారా పట్టాలు మంజూరు చేసే విధంగా తనవంతు కృషిచేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భరోసానిచ్చారు. కొండమోడు పరిధిలోని టీఎన్ నగర్ వాసులకు అటవీ శాఖ ద్వారా నోటీసులు పంపిణీ చేయగా.. కాలనీ వాసులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎన్ నగర్ వాసులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా 300 కుటుంబాలకు చెందిన ఎస్టీలు, ఇతర నిరుపేదలు గృహాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు అర్ధంతరంగా నోటీసులు ఇస్తే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. స్పందించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ టీఎన్ నగర్ వాసులందరికీ అండగా ఉంటానన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం నివాసముంటున్న వారు ఖాళీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎస్టీలకు మాత్రమే అటవీభూములకు పట్టాలివ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ నిర్వాసితులు కాకుండా ఉండేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేసి పట్టాలిచ్చేందుకు కృషిచేస్తామని అన్నారు. డీఎఫ్ఓ రామచంద్రయ్య మాట్లాడుతూ.. రికార్డుల పరంగా అటవీశాఖ భూమిగా ఉన్నందున నోటీసులు అందజేశామని వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించి, టీఎన్ నగర్‌లో నివాసముంటున్న వారిని ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, తహసీల్దార్ ఎ.నళిని, జడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణపై అవగాహన



పిడుగురాళ్ల: డ్రిపు ద్వారా మిరప పంట సాగు చేయాలని ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని జూలకల్లు రైతు భరోసా కేంద్రంలో రైతులకు డ్రిప్ పద్ధతి, మిరప సాగులో సమగ్ర సస్యరక్షణను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రిపు పద్ధతి ద్వారా ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు షేక్ దస్తగిరి, కేఎల్ యూనివర్సిటీ సిబ్బంది జీఆర్ఎఫ్ వైశాలి, ఇంజినీర్ అశ్వక, కజా మొహిద్దీన్, అనుసాగర్, మనికంఠ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు నగేష్‌పై పోలీస్‌స్టేషన్‌లో వీఆర్ఏ ఫిర్యాదు

సత్తెనపల్లి: సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌పై కొమెరపూడి గ్రామ వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని తనకు సమాచారం వచ్చిందన్నారు. సాయంత్రం 6 గంటలకు కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ నగేష్ ఆవేశంతో ఊగిపోతూ ఏంట్రా అని చెంపపై కొట్టాడని, తాను ఎప్పుడు రమ్మన్నాను, ఎప్పుడొచ్చావు అంటూ నానా దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ గ్రామానికి ఆటోలు తప్ప.. బస్సులు లేవని, అందువల్లే తాను సమయానికి రాలేకపోయానని తెలిపారు. తాను పక్షవాతంతో బాధపడుతున్నా అకారణంగా కొట్టిన తహసీల్దార్ నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ నగేష్‌ను సంప్రదించగా ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో హాజరు పెండింగ్ ఉండడంతో వేయించుకోవాలని మూడు రోజులుగా సమాచారం పంపుతున్నప్పటికీ వీఆర్ఏ రాలేదని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మనిషిని పంపగా సాయంత్రం వరకు రాలేదన్నారు. కేవలం తన ఒక్కడి హాజరు పెండింగ్ ఉండడం వల్ల ఇబ్బంది అవుతుందని మందలించడంతో దాన్ని సాకుగా తీసుకొని తాను కొట్టినట్లు చెబుతున్నాడని చెప్పారు. తాను కొట్టలేదని దీని వెనుక ఎవరో కథ నడుపుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పట్టణ సీఐ యు.శోభన్ బాబును సంప్రదించగా కొమెరపూడి వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదులో కులల ప్రస్తావన ఎక్కడా నమోదు చేయలేదని, అయినప్పటికీ దీని పై విచారణ జరుపుతున్నామన్నారు.

ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు పేర్కొన్నారు. శనివారం సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమార్‌ని కలిసి కొమెరపూడి వీఆర్ఏ కొరబండి శ్రీనివాసరావుపై తహసీల్దార్ నగేష్ దాడి చేయడాన్ని ఖండిస్తూ వినతిపత్రం అందించారు. క్రోసూరు యూనిట్ ప్రెసిడెంట్ బాషా, జేఏసీ సంఘ నాయకులు ప్రభుదాసు, అంబేడ్కర్, సత్యనారాయణ, వెస్లీ, ఇబ్రహీం, రవి ఉన్నారు.

ఘనంగా శీతలాదేవి ఆలయ వార్షికోత్సవం



నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డి పాలెంలో వేంచేసియున్న శీతలా దేవి అమ్మ వారి ఆలయ 7వ వార్షి కోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపి అలంకరించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భవనం వారి ఇలవేల్పు అయిన శీతలాదేవికి భవనం వర్గీయులు గ్రామంలో ఆలయం నిర్మించి ప్రతి ఏడాది వేడుకలు నిర్వహిస్తున్నా రు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ భవనం మోగలారెడ్డి, భవనం సాంబిరెడ్డి, భవనం శివారెడ్డి, భవనం వీరారెడ్డి, భవనం కృష్ణారెడ్డి, భవనం సుధాకరరెడ్డి పర్యవేక్షించారు.

సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలి

ఉత్సాహంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన



బండలాగుతున్న ఎడ్ల జత

గురజాల: మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. జంగమహేశ్వరపురం గ్రామంలో వెంకటేశ్వరస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామ రైతుసంఘం, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మొత్తం 15 జతల ఎడ్లలో.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మాదనబోయిన పోతురాజు యాదవ్ ఎడ్లు 4106.11 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు వేణుగోపాలరావు ఎడ్లు (4000 అడుగులు) ద్వితీయ, పెదకూరపాడు గ్రామం శన్నెదార రామ్ తేజచౌదరి, వున్నం బాజీ చౌదరి ఎడ్లు(3815 అడుగులు) తృతీయ స్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రైతు సంఘం నాయకులు వ్యవహరించారు.

పురగిరి క్షత్రియ సత్రానికి స్థలం కేటాయింపు



ఈఓ లవన్నకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శివరామయ్య తదితరులు

వెల్దుర్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లన్న దేవస్థానం సమీపంలో పురగిరి క్షత్రియ నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం 50 సెంట్ల స్థలం కేటాయించినట్లు ఎంపీపీ చింతా శివరామయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దస్తావేజులను శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్నకు అందజేసినట్లు చెప్పారు. త్వరలోనే సత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చింతా ఆదినారాయణ, యలమంద కోటయ్య, తోట ఆంజనేయులు, శివ, పార్లపల్లి చినగాలయ్య, సాని రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

గురజాల: స్థానిక చల్లగుండ్ల గార్డెన్‌లో శనివారం తానా ఫౌండేషన్ (ఉత్తర అమెరికా తెలుగు సంఘం), బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు నిర్వహకుడు చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. శిబిరాన్ని వైద్యులు చల్లగుండ్ల శ్రీరామమూర్తి, జి.మధుకర్‌రెడ్డి, పులుకూరి శివన్నారాయణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 580 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 223 ఈసీజీ, 44 అల్ట్రా సౌండ్ స్కానింగ్, 29 పాప్ స్మియర్, 12 ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు శ్రావణ్ కుమారి, అమూల్య ప్రేమ్ కుమార్, రవిశంకర్, ప్రదీప్‌రెడ్డి, ఫణికుమార్, జీవీఆర్ చౌదరి, మీనా, శ్రీకాంత్, సుష్మలు వైద్య సేవలందించారు. వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పునీత జోజప్ప ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య

దుర్గి: ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ కలిగి ఉండాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. శనివారం స్థానిక జోజప్ప పునీత ఆలయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నిత్య సహాయమాత గృహాల సముదాయాన్ని ప్రారంభించారు. మహిళలు ఆలపించిన క్రీస్తు స్తుతి గీతాలు అలరించాయి. మహిళల కోలాటాలు, పలు కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఉదయం నుంచి భక్తుల సందర్శనతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎల్లబోయిన గోపాల్, సింగు రవి, విచారణ కర్తల సంఘ పెద్దలు, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమంలోని వారికి సంతానం ఉన్నారా..? వారే పంపించారా లేక.. నిరాదరణ వల్ల వచ్చారా..? అని అందరినీ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్.లక్ష్మి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలల రక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుభాషిణి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): చిన్న పిల్లలు దైవంతో సమానమని, వారికి రక్షణ కల్పించడం తమ కర్తవ్యమని దిశ పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ, ముప్పాళ్ళ జడ్పీ, మాదల బీసీ గురుకుల పాఠశాలల్లో పోలీసు, జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బాల, బాలికలపై జరిగే నేరాలు, వాటికి అమలయ్యే శిక్షల గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలు చేత వెట్టి చాకిరి చేయించడం, బాల్య వివాహాలు నేరమని వివరించారు. తమ చుట్టు పక్కల పరిసరాలను గమనించుకోగలిగే జ్ఞానాన్ని పెంపొందిచుకోవాలని, ప్రమాదాన్ని పసిగట్టి ఉపాధ్యాయులకు, పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దిశ ఎస్సై సుబ్బారావు, ఏహెచ్‌టీయూ విభాగం ఎస్సై అల్లూరిరెడ్డి, పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో ఆరోపణలు సహించేది లేదు

క్రోసూరు: మండలంలోని డీలర్లు, ఎండీయూ నిర్వాహకులు ప్రజలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరరావు సూచించారు. శనివారం రేషన్ డీలర్లు, ఎండీయూ నిర్వాహకులతో ఆయన సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో ఆరోపణలొస్తే.. సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు తమ కమీషన్ల గురించి అడిగారు. అనంతరం కొత్తగా వచ్చిన తహస్దీలార్‌ను డీలర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 43మంది రేషన్‌డీలర్లు, 13 మంది ఎండీయూ నిర్వహకులు పాల్గొన్నారు.